# తీరందాటిన తుఫాన్

కుందుర్తి ఇందిరాదేవి

నాలుగు రోజుల్నుండీ ఒకటే వర్షం. అంతకంతకూ తీవ్రరూపం దాలుస్తున్నదే కానీ ఏమాత్రం తెరిపివ్వడం లేదు.

బంగాళా ఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని చెబుతున్నప్పుడే స్వాగత్ ఊరుబయల్దేరాడు. అప్పటికే సన్నగా ముసురు ప్రారంభమైంది.



"ఈ తుఫాన్‌లో నేనొక్కదాన్నే ఉండాలా...." బిక్క ముఖం పెట్టింది తనప్పుడే.

"ఈసారికి ఎలాగో ఎడ్జస్ట్ కారా! అమ్మకి సీరియస్‌గా ఉందని టెలిగ్రామ్ వస్తే వెళ్ళకుండా ఎలా చెప్పు..." స్వాగత్ నచ్చచెబుతూ అన్నాడు. "వని మనిషి తోడు పడుకుంటుంది. జాగ్రత్తగా ఉండు. రెండ్రోజుల్లో వచ్చేస్తాను..." అని జాగ్రత్తలు చెబుతూనే వెళ్ళి పోయాడు.

అదుగో స్వాగత్ వెళ్ళిపోయాకే అసలు తుఫాన్ ప్రారంభం.

ఏమి తోచక స్వాగత్ బుక్ షెల్ఫ్‌లోంచి పుస్తకం తీస్తుంటే జారిపడిందా ఉత్తరం.

స్వాగత్ ఆఫీస్‌కి వచ్చిందల్లె ఉంది. తనతో చెప్పనే లేదే! వర్ననలా....

శ్రీజ తటపటాయిస్తూనే చూసింది. స్వాగత్ తండ్రి వ్రాసిన ఉత్తరం.

శ్రీజ శరీరంలోకి వెచ్చటిరక్తం ఒక్కసారి నర్రున పాకినట్టయింది. ఏం రాసి ఉంటారు? అయినా తనకి చెప్పకూడని రహస్యాలా!

తామిద్దరూ ప్రేమించి పెళ్ళి చేసుకోవటం పెద్ద వాళ్ళెవ్వరికే ఇష్టంలేదు. అందుకే అందరూ ఉండి కూడా దూరంగానే ఉండిపోయారు.

ఆ మధ్య ఓసారి తండ్రికి సీరియస్‌గా ఉందని టెలిగ్రామ్ వచ్చింది. తనుకూడా వస్తానంటే స్వాగత్ వద్దని ఒక్కడే వెళ్ళాడు.

అంతగా అవసరమైతే టెలిగ్రామ్ ఇస్తాను. అప్పుడు రావచ్చని చెప్పాడు.

తను ఆ రెండు రోజులు టెన్షన్ భరించలేకపోయింది. ఏం వార్త వస్తుందోనని.

ఆ అవసరం లేకుండా రెండురోజుల్లో స్వాగత్ వచ్చేశాడు.

"ఏం జరిగిందో చెప్పమంటే..." 'ఏం లేదు. చిన్న నుస్తీ..'" అనేశాడు.

తనకసలు అత్తవారింట ప్రవేశమే లభించలేదు.

ఇప్పుడీ ఉత్తరం. అదీ ఆఫీసుకి. తనకి తెలియకుండా ఇంకెన్ని ఉత్తరాలొచ్చాయో...

మొదట తండ్రికి సీరియస్....

ఇప్పుడు తల్లికి సీరియస్....

మధ్యలో ఈ ఉత్తరం....

ఏదో ఉంది. మనసు కూడా గట్టిగా హెచ్చరిస్తోంది. కానీ అది స్వాగత్ ఉత్తరం! అదీ తనకి చెప్పలేదు అంటే తనకి తెలియ కూడని విషయమేదో అందులో ఉంది.

శ్రీజ కాసేపు అన్ని మేనర్స్ పక్కకి పెట్టి ఉత్తరం విప్పింది.

చి॥ స్వాగత్‌కి,

మీ నాన్న దీవించి వ్రాయునది నీకు చెప్పిన విషయం ఏం చేశావు. ఇంతవరకూ నీనుండి జాబులేదు.

ఏదో మీ ఇద్దరూ ప్రేమించి పెళ్ళి చేసుకున్నా హాయిగా పిల్లాపాపలతో బతికితే అంతే చాలు అనుకున్నాము.

పెళ్ళయి ఆరేళ్లయినా ఇంతవరకూ అమ్మాయి కడుపు పండలేదు. నీ స్నేహితుడు మురళిద్వారా తెలిసింది. నీ భార్యకి సంతానయోగం లేదని. వంశోద్ధారకుడి కోసమైనా మా మాట విని నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకో.

ఇది అమ్మాయికి ద్రోహం చేసినట్టు కాదు. కోర్టుకెళ్ళినా ఈ విషయంలో విడాకులు కూడా మంజూరవుతాయి.

కృష్ణారావుగారు వారి అమ్మాయి గంగను నీ కివ్వడానికి ఇప్పటికీ సిద్ధంగానే ఉన్నారు. మీ అమ్మ నీ విషయంలో కుమిలిపోతోంది. నీ కన్నా చిన్నవాళ్ళయిన మిగతా ఇద్దరూ పిల్లా, పాపతో హాయిగా కాపురాలు చేసుకుంటుంటే నీ ఖర్మ ఇలా కాలిందేమిటాని ఏడవని రోజులేదు.

మళ్ళీ పెళ్ళి చేసుకున్నా ఆ అమ్మాయిని నువ్వు నీ దగ్గరే ఉంచుకుని ఏలుకోవచ్చు. ప్రపంచంలో ఎంత మంది రెండు పెళ్ళిళ్ళు చేసుకోవటం లేదు.

మంచి ముహూర్తాలు కూడా నిర్ణయించాము. నువ్వు వీలు చూసుకుని వెంటనే ఓ వారం రోజులు సెలవు పెట్టిరా.

నువ్వు వస్తావని వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తుంటాము.

ఆశీర్వచనములతో
మీ నాన్న

శ్రీజ శరీరం ఒక్కసారి చల్లబడింది. కళ్ళు తిరిగినట్టయి ఆ మట్టునే కూర్చుండి పోయింది.

స్వాగత్ హఠాత్తుగా వెళ్ళడానికి కారణం ఇదా! తల్లి సీరియస్‌గా ఉందన్న టెలిగ్రామ్ అబద్ధమేనా.... నిజమేనా...

ఓ గాడ్! అందుకేనా రెండురోజుల్లో వస్తానన్న స్వాగత్ ఇంతవరకూ రాలేదు.

తను ఈ తుఫాన్‌లో బిక్కు బిక్కుమంటూ ఎప్పుడెప్పుడొస్తాడా అని కళ్ళల్లో వత్తులు వేసుకొని ఎదురుచూస్తుంటే...

అతడక్కడ పెళ్ళి చేసుకుని కొత్త భార్యతో కులాసాగా గడిపేస్తున్నాడా...!!

ఆ ఊహే భరించరానిదిగా ఉంది.

పెళ్ళయిన కొత్తల్లో తనకి తెలీలేదు పిల్లల అవసరం. రెండు మూడు సంవత్సరాలు గడిచిన తర్వాత తమిద్దరి మధ్యా ఏదో వెలితి....

ఇద్దరి మధ్యా గాలి కూడా దూరకూడదనే దురాశపోయి ఇద్దర్నీ మరింత దగ్గర చేసే బంధం ఒకటి కావాలని...

ఆ బంధం పిల్లలని....

ఆ పిల్లలు ఇద్దరి ప్రేమానురాగాలకి వారధి అవుతారని... తమ యవ్వనం కరిగించి వెలిగించిన దీపాలని... ఆ దీపాలు జీవితమంతా దీపావళి వెలుగులు విరజిమ్ముతాయని తెలుసుకుని...

ఆ దీపాలు వెలిగిద్దామని.. వెలగాలని కోరుకునే సరికి బయట పడింది.

అప్పటికీ ఎంతో మంది డాక్టర్ల చుట్టూ తిరిగారు. ఎన్నో పూజలు చేసింది. ఎన్నో నోములు నోచింది. అయినా ఏ భగవంతుడూ కనికరించలేదు.

తను ఈ జన్మలో తల్లికాలేదు.

మాతృత్వంలోని మాధుర్యాన్ని ఈ జన్మకిక తను చవిచూడలేదు.

"మన ఇంటి దీప మిదుగో అని భర్త చేతుల్లో ఆడుకోడానికి ఒక బిడ్డ నివ్వలేని తను ఒక అసమర్థురాలైన భార్య..."

"మీ వంశోద్ధారకుడిడుగోండి...." అని అత్తమామలకి చూపించి వారి ఆదరాభిమానాలు పొందడానికి నోచుకోని నిర్భాగ్యురాలైన కోడలు...."

పుట్టిన పిల్లల కోసమైనా తల్లిదండ్రులు దగ్గరవుతారనే ఆశ ఇద్దరికీ అడియాసే అయింది.

స్వాగత్‌కిది గొప్ప షాక్!

కుమిలి కుమిలి ఏడుస్తున్న తనని అతనే ఓదార్చాడు. ఆ కన్నీటి వరదలో తను కొట్టుకుపోకుండా తన స్నేహపూరిత హస్తాన్ని అందించాడు. తన గుండెల్లో పొంగుతున్న నిరాశ నిస్పృహలు ఏ మాత్రం బయట పడనివ్వకుండా తన గుండెగూటిలో దాచుకున్నాడు.

"మనకి పిల్లలు లేకపోతే ఏం చేస్తాం శ్రీ. ఇంతే ప్రాప్తం అనుకుందాం. మన కోసం ఎవరూ రాకపోతేనేం...

నీ కోసం నేను..... నా కోసం నువ్వూ... బతికేద్దాం...."

ఆ మాటల బలంతోనే తనింతకాలం నుండీ బతుకుతోంది. అతడు కురిపించే ప్రేమామృతపుధారలతో తను కొత్త జన్మఎత్తింది.

"అంతగా పిల్లలు కావాలనుకుంటే ఎవరినైనా పెంచుకుంటే సరి....." అని తనకితాను సర్దిచెప్పుకుంది.

రోజులు మళ్ళీ మామూలుగా హాయిగా గడిచిపోతున్నాయి.

ప్రశాంతమైన ప్రత్యూష్యంలో మొదలయ్యే జీవితం.... సాయంత్రపు సందడిలో అలసిపోయి... అందమైన అర్థరాత్రికి అతడి గుండెల్లో ఒదగటంతో పూర్తవుతోంది.

కానీ.... కానీ... ఇప్పుడు మళ్ళీ ఇదేమిటి?

పైకి తనని ఓదార్చాడేగాని స్వాగత్‌కి పిల్లల మీద కోరిక గానీ ఉందా! ఉంటే తనకా సంగతి చెప్పొచ్చు గదా....!!

"తమ దాంపత్యవనంలో వసంతాగమనానికిక తావు లేదని... పూలే తప్ప ఫలంలేని అందమైన పైన్ వృక్షమే తప్ప. కాసే, పూసే చెట్లు పెరగవని.....

ఈ నిర్ణయం తీసుకున్నాడా!

స్వాగత్.... స్వాగత్... నిన్ను పోగొట్టుకున్న నా బ్రతుకెందుకు! నేను చచ్చిపోతాను స్వాగత్.

నేను బ్రతికి ఉండగా నువ్వు ఇంకొకరికి ధారాదత్తం కావడం నేను భరించలేను.

తిండి లేదు. నిద్ర లేదు!

ఆలోచనలు...... ఒకటే ఆలోచనలు.


స్వాగత్‌లేని తన జీవితం ఎలా ఉంటుందో ఊహించే ప్రయత్నంలో శ్రీజ పూర్తిగా ఓడిపోయింది.

ఎలా! ఎలా! ఏం చెయ్యాలి?

ఆలోచనల ప్రవాహంలో కొట్టుకుపోతున్న శ్రీజ గౌరమ్మ పిలుపుతో బయటికి వచ్చింది.

ఆ వర్షంలోనే గొడుగేసుకొచ్చి "ఆంటీ మీకు ఫోన్" అని చెప్పింది పక్కింటి వాళ్ళమ్మాయి.

ప్రాణాలు అరచేతులో పెట్టుకుని వెళ్ళింది.



భూగోళంపై గల జంతువులన్నీ మన దృష్టిలోకి వచ్చాయా? లేదనే చెప్పాలి. మానవుడు కాలిడని ప్రదేశాలు అనేకం ఇప్పటికీ లేకపోలేదు. ఇలాంటి ప్రదేశాల్లో లేదా మనకు తెలిసిన ప్రదేశాల్లో మనకు కనిపించకుండా జంతువులు ఏవైనా దాగున్నాయా? యతి, లాచ్‌నెస్ మాన్‌స్టర్, డైనోసార్లు ఈ కోవకు చెందిన జంతువులుగా పరిగణించవచ్చు. ఇలా మనకు కనిపించకుండా దాగిన జంతువుల అధ్యయనాన్నే క్రిప్టోజువాలజీ అంటారు.

-సమ్మెట

స్వాగత్!

"శ్రీ ఎలా ఉన్నావురా ఈ తుఫాన్‌లో...." ఆత్రంగా అరిచాడు. "భయం వెయ్యట్లేదు కదా...."

కెరటాల్లా విరుచుకు పడుతోన్న ఆనందాన్ని అవు కుంటూ "మీరు సృష్టించిన తుఫాన్ కన్నా పెద్దదా బయటి తుఫాన్" బయటికి అనలేదు. మనసులో అనుకుంది.

"మీరెప్పుడొస్తున్నారు....."

"నిన్ననే వచ్చేద్దామనుకున్నాను. కాస్త ముఖ్యమైన పని ఉండి ఆగిపోయాను. దానికితోడు తుఫానా! కాలు బైట పెట్ట నివ్వడం లేదు. ట్రైయిన్స్ చాలా కేన్సిల య్యాయి. ఈ ఫోన్ కోసం ఎంత అవస్థపడ్డానో తెలుసా....!"

"కాలు బైటపెట్టనివ్వంది తుఫానా! కొత్త పెళ్ళి కూతురా.....". గొణిగింది.

"నాకు వినబడ్డం లేదు శ్రీ. చూడు నేను వచ్చేటప్పుడు నీకో బహుమతి తెస్తున్నాను...."

"బహుమతా.... సవితినా....." మళ్ళీ గొణిగింది.

"కాస్త గట్టిగా మాట్లాడరా. బహుమతేంటో చెప్పుకో లేవు. కావాలంటే పందెం వేస్తాను...."

"తెలీకపోతేగా....."

"రేపే బయల్దేరుతున్నాను. సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఏంటో నేనొచ్చేదాకా సస్పెన్స్. బై....." స్వాగత్ ఫోన్ పెట్టేశాడు.

ఎంత దాచుకుందామన్నా అతడి గొంతులో దాగని టెన్షన్.... ఇదీ అని చెప్పలేని ఆనందం.... శ్రీజని బలంగా తాకాయి.

స్వాగత్ వచ్చే సరికి తను ఇంట్లోంచి పారిపోతే....!

'హమ్మో! ఈ వర్షంలో తన కోసం వెతకలేక నుడి పడతాడు.

చచ్చిపోతే! వద్దు! వద్దు!

స్వాగత్‌ని ఒక్కసారి కళ్ళనిండా చూసుకొని తర్వాత చెయ్యాలా పని.

భూమ్యాకాశాలను ఏకం చేస్తోన్న వర్షధారలు ప్రపంచాన్ని చీకటి మయం చేస్తుంటే.....

గుండె గోడలను బలంగా తాకుతోన్న కన్నీటి ధారలు సుందరమైన భవిష్యత్‌ని అంధకారమయం చేస్తున్నాయి.

నాలుగు రోజుల క్రితం మనసులో పడిన వాయుగుండం శ్రీజని ఒక్క కుదుపు కుదిపింది.

స్వాగత్ తిరిగి వచ్చే సరికి శ్రీజ జీవచ్ఛవంలా తయారయింది.


వర్షం మూలంగా పెందలాడె చీకటి పడింది. బయట వర్షం తాలూకు ఉధృతం తగ్గిపోయినా చలి గాలి మాత్రం వస్తోంది.

ఫలితాల కోసం వేచి ఉండే విద్యార్థిలా వేచి ఉంది. శ్రీజ.

"ఏటమ్మా ఏం అయింది. ఒక తిండి లేదు. తిప్పల్లేదు. ఉలకవు. పలకవు. మొగుడు నాల్రోజులు ఊర్కెల్తే దిగులు పడిపోనావు. హయ్యో పిచ్చి తల్లీ. ఎట్ట బకుతావ్ ఏంటో..."

గౌరమ్మ సణుగుళ్ళు, కేకలు శ్రీజ పరిస్థితిలో మార్పు తేలేకపోయాయి.

"నాలుగు రోజులు కాదు గౌరమ్మ. జీవితమంతా నా మొగుడు లేకుండా ఎలా బతకాలా అనే దిగులు పడుతున్నాను...." ఆమె పెదవి దాటి బైటికి రాని మాటలు.



కోసిన పూలు తమ స్వతఃస్సిద్ధమైన వాసనని కొంత వరకు కోల్పోతాయని, వాటి నుంచి తయారు చేసిన పరిమళ ద్రవ్యాల్లో వాసనలు పరిపూర్ణమైనవి కావని సెలవిచ్చారు. ఇంటర్నేషనల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్రాన్సస్ సంస్థ వారు అనేక పూలు, సజీవ స్థితిలో వెదజల్లే వాసనలు ఉత్పత్తి చేయగలిగారు.

-నమ్మేట

బయట ఎవరో తలుపులు బాదుతున్నారు.

టేబిల్ మీది పెళ్ళిఫోటో చూస్తున్న శ్రీజ కదల్లేదు. స్వాగత వచ్చి ఉంటాడు. అతడికోసం గుమ్మంలోనే ఎదురు చూసే తను....

అలికిడయితే చాలు ఛెంగున దూకి పరిగెత్తే తను...

అసలు ఏమి పట్టనట్టు ఎలా కూర్చోగలిగిందో శ్రీజకే ఆశ్చర్యం వేసింది.

తన వల్ల కాదు. ఈ కొత్త దంపతులకి హారతి పట్టి తను స్వాగతం చెప్పలేదు.

"శ్రీ.... శ్రీ...

కొత్త భార్య వర్షంలో తడుస్తుందేమో ఆ ఆత్రం...!

గౌరమ్మ తలుపు తీసినట్టుంది. మాటలు వినబడుతున్నాయి. అయిదు నిమిషాల తర్వాత స్వాగత్ గదఇలోకి వచ్చాడు.

వస్తూనే "ఏం చేస్తున్నావురా శ్రీ ఈ చీకట్లో..." లైటు వేశాడు.

శ్రీజ చప్పున కళ్ళు తుడుచుకుంది.

"ఇంకాసేపుంటే ముద్దగా తడిసిపోయే వాళ్ళం..' అతడు బట్టలు మార్చుకుని తలతుడుచుకుంటూ వచ్చాడు.

"నేను తెచ్చే బహుమతి కోసం బైటే కాచుక్కూచుంటావనుకున్నాను. అరే అదేమిటి అలా ఉన్నావు ఒంట్లో బావో లేదా. జ్వరమా..." చేయి పట్టి చూస్తూ అన్నాడు.

'నాలుగు రోజులకే బెంగపెట్టుకున్నావా..."

ఆ ఆప్యాయత, ఆలాలింపు శ్రీజ ధిక్కరించలేనివి. ఉధృతంగా దుఃఖంవచ్చేసింది.

"ఛ!ఛ! ఎందుకు!? నేను వచ్చేశాగా... స్వాగత్ మృదువుగా అన్నాడు.

"చెప్పవేం! ఇప్పటికైనా. పిల్లల కోసం నేను మళ్ళీ పెళ్ళి చేసుకున్నారా అని. మాట్లాడవేం. ఈ కుశల ప్రశ్నలు అవీ రాబోయే ప్రళయానికి నాందీనా..."

స్వాగత్ భుజాల మీంచి చూస్తున్న శ్రీజ కళ్ళు వెడల్పయ్యాయి. పని మనిషి గదిలోకి వస్తోంది. వస్తూ ఊరికేరాలేదు.

పొత్తిళ్ళల్లో ఒక పసివాడు!

"వీడా తనకి బహుమతి...." శ్రీజ చప్పున స్వాగత్ ముఖంలోకి చూసింది.

స్వాగత్ శ్రీజ రెండు చేతులు తన మెడ చుట్టూ వేసుకుని 'బహుమతేమిటో చెప్పుకోలేకపోయావు. ఓడి పోయావు. అవునా.." అన్నాడు.

అతడి కళ్ళలో ఎంత నిశ్చింత! అసలు అతడి స్వచ్ఛమైన మనసు గురించి తనెందుకు అన్ని ఆలోచనలు చేసింది.

భయం! ఎస్....! తన స్వాగత్ తనకి కాకుండా పోతాడేమో అన్న భయం.

అతడి కళ్ళల్లో అదే కొంటెతనం...

పెదవులపై అదే అల్లరి....

ఏ మార్పులేదు. మార్పంతా తనలో. తన ఆలోచనల్లోనే... తన స్వాగత్ అచ్చంగా తన స్వాగత్ లాగే తిరిగొచ్చేశాడు. నిజం? థ్యాంక్‌గాడ్!! ఈ ఓటమి ఎంత హాయిగా ఉంది!

కళ్ళల్లోంచి మేఘమల్హార్ జారుగుతోంటే... లత్తుకద్దిన ట్టు ఎర్రగా ఉన్న పెదవులు విప్పి డగ్గుత్తికతో... "అత్తయ్యగారూ ఎలా ఉన్నారు?...' అంది ఎలాగో అయిపోతూ. 'బేమగ్గా ఉంది. ఏదో చిన్న పేచీ అమ్మతో..."

తన కన్నీళ్ళకి అర్ధాదుగుతోన్న అతడి చూపులు తప్పించుకుంటూ అంది "ఈ బాబు..."

"చాలా బాడ్ నన్ శ్రీ. మురళీ తెలును కదా. యాక్సిడెంటయి ఇద్దరూ పోయారు. ఈ పసివాడేదో లక్కీగా తప్పించుకున్నాడు. మన కోసమే అన్నట్టు.

మురళీ వాళ్ల అన్నయ్య వీడిని పెంచడానికి అవస్తపడుతున్నాడు. ఆయనకి ఇద్దరి పిల్లలు. ఎవరు పెంచుతారని బాధపడుతుంటే తీసుకొచ్చేశాను. మనకి ఎలాగూ పెంచుకోవాలనే ఆలోచన ఉంది గదా...."

న్యూస్ టైమైంది ఉండు...." స్వాగత్ రేడియో వైపు వెళ్ళాడు. ఒక్కసారి అద్దంలో ముఖం చూసుకో ఎలా ఉన్నావో.... అంటూ

శ్రీజ ఎదురుగుండా ఉన్న అద్దంలోకి చూసింది.

అదేమిటని అలా అంటాడు! కళ్లలో కన్నీళ్లతో పాటు ఇంద్రధనుస్సు మెరుపులు కనబడుతుంటే...!

వాడిపోయిన ముఖంలో ఆనందం చిందులు తొక్కుతుంటే....

శ్రీజకళ్ళు మంచంవైపు తిరిగాయి.

పొత్తిళ్లలో పసివాడు కేరింతలు కొడుతూ ఆడుకుంటున్నాడు.

నిద్రపోతున్న ఇంటిని చైతన్యవంతం చేయడానికి వచ్చాడు.

బోసిపోతున్న తన ఒడిని నింపడానికి వచ్చాడు. భయపెట్టే భవిష్యత్తు తన ఆటపాటలతో, అల్లరితో ఎదుర్కొనే శక్తిని ఇవ్వడానికొచ్చాడు.

స్వాగత్ రేడియో పెట్టాడులా ఉంది. వార్తలు వస్తున్నాయి. బంగాళాఖాతంలో పడిన వాయుగుండం తీరాన్ని దాటి బలహీనపడింది.

"హమ్మయ్యా! తుఫాన్ తగ్గిపోయింది. గౌరమ్మా రెండు కప్పుల కాఫీ పట్రా..." స్వాగత్ అంటున్నాడు.

మాటలు మౌనంతో చేతులు కలిపినట్టు శ్రీజకి ఒక్క మాటైనా పెదవి దాటడం లేదు.

అంత వరకూ మనసును ఉండచుట్టుకుంటూ ఊపేసిన దిగులు ఎవరో చేత్తో తీసేసినట్టుగా మనసు తేలిక పడుతోంటే... కళ్ళల్లో రేగిన తుఫాను మెల్ల మెల్లగా తేలిపోతోంటే.

తన కన్నీళ్ళు స్వాగత్ కంట పడకుండా... పసివాడిని ముద్దాడే నెపంతో వాడి వైపు తిరిగింది. ●